# కార్పొరేటు కళాశాలల వ్యవస్థీకృత హత్యలకు మూలాలు

**దేశవ్యాపితంగానూ,** ప్రత్యేకించి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ విద్యార్థుల బలవన్మరణాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. రైతులు, చేనేత కార్మికుల తర్వాత ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారిలో వీరే అధికంగా వున్నారు. గత రెండు నెలల కాలంలో తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ కళాశాలల వివిధ శాఖలలో 50 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు ఆత్మ'హత్య'లకు ఒడిగట్టారు. అఖిలభారత స్థాయిలోనూ ప్రతిష్ఠాత్మక కోర్సులలో టాప్ ర్యాంకులను, అధిక సీట్లను సాధిస్తుందని చెబుతున్న రాజస్థాన్‌లోని 'కోట'లో గత ఒక్క సం॥ర కాలంలోనే 60 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొన్నారు.

తల్లిదండ్రులు ఆశించిన విధంగా రాణించలేక పోతున్నామని కొందరు, ఆశించిన కోర్సు చదవలేక పోతున్నామని కొందరు, పరీక్షలలో ఫెయిల్ అయ్యామని కొందరు, ఫెయిల్ అవుతామేమోనని కొందరు, తక్కువ మార్కులొచ్చాయని మరికొందరు, ఉదయం నుండి రాత్రిదాకా చదువుల యంత్రాలుగా మారలేక మితిమీరిన ఒత్తిడికి గుర్రై కొందరు, యాజమాన్యాల మానసిక వేధింపులకు తాళలేక ఇంకొందరు... ఇలా ప్రతిరోజూ విద్యార్థుల బలవన్మరణాల వార్తలు స్పందించే ప్రతి హృదయాన్నీ కలచివేస్తున్నాయి.

జీవితపు విస్తృతితో పోల్చినపుడు 'అల్పమైన సమస్యలే' విద్యార్థులకు గుదిబండలుగా గోచరిస్తున్నా యెందుకు? సమస్యను నలుగురితో పంచుకుని పరిష్కారాన్ని వెతుక్కోకుండా, జీవితాన్ని చాలించాలన్న కఠోర నిర్ణయాన్నెందుకు తీసుకుంటున్నారు? మార్కులు, ర్యాంకులు, సీట్లు సాధించటంలో విఫలమైతే, జీవితాన్నే కోల్పోయినట్లుగా మరణమే శరణ్యమని ఎందుకు భావిస్తున్నారు? మితిమీరిన మానసిక ఒత్తిడికి కారణాలను అన్వేషించకుండా, మనోవేదన అంతానికి మృత్యువునే పరిష్కారంగా ఎందుకు ఎంచుకుంటున్నారు? తాము 'ప్రేమ'గా భావిస్తున్న దానిలో విఫల మయ్యామనో, దుర్వ్యసనాలతో దిగజారిపోయో, సినీ, అంతర్జాల మాధ్యమాల మాయోపాయాలలో చిక్కుకుని బయట పడలేకనో.... ప్రాణాలను బలిచేసుకుంటున్న కళాశాలస్థాయి విద్యార్థి యువజనులు కొందరున్నారు. అయితే ప్రస్తుతం, వ్యవస్థీకృత కార్పొరేటు 'హత్య'ల మూలాల పరిశీలన వరకు పరిమితమౌదాం. కార్పొరేటు విద్యాసంస్థల పరిణామక్రమాన్ని, వరుసగా పాలన సాగిస్తున్న ప్రభుత్వాల నిర్వాకాన్ని, జీవితపు ఆటుపోట్లతో సంఘర్షిస్తూ ముందుకు సాగాలని ప్రబోధించే విద్యావిధాన ఆవశ్యకతను, విద్యార్థుల బలవన్మరణా లపై భిన్న వాదనలను, కుటుంబ, సామాజిక, ఆర్థిక, రాజకీయ మూలాలను పరిశీలిద్దాం.

## కార్పొరేటు విద్యావ్యాపార లాభదాహం

బడి ఈడు పిల్లలందరికీ కనీసంగా విద్యను అందించాల్సిన బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకున్న ఫలితంగా ప్రైవేటు విద్యాసంస్థలు ఉనికిలోకి వచ్చాయి. 1970ల నాటికి ఇవి పాలకుల అండతో ప్రైవేటు రెసిడెన్షియల్ పాఠశాలలుగా, కళాశాలలుగా తదనంతర కాలంలో కార్పొరేటు కళాశాలలుగా, గుత్త సంస్థలుగా విస్తరించాయి. చదువుకున్న నిరుద్యోగులు తను జీవనాధారం కోసం నిర్వహించుకునే చిన్న చిన్న ప్రైవేటు ట్యుటోరియల్స్‌ను, విద్యాసంస్థలను కార్పొరేటు తిమింగలాలు కబళించివేశాయి. చిన్నపాటి ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేసే 'పేరున్న' బోధనా సిబ్బందిని ఆశలు, ప్రలోభాలు చూపి, అనైతిక పద్ధతుల్లో కార్పొరేటు సంస్థలు గుంజివేసుకున్నాయి. బ్యాంకు పరీక్షలు మొదలుకొని ఏ ఉద్యోగానికైనా, ఏ కోర్సుకైనా ప్రవేశ పరీక్షలు వ్రాయాల్సిరావటం, ముఖ్యంగా మెడికల్, ఐఐటి, ఇంజనీరింగ్ తదితర వృత్తివిద్యా కోర్సులలో చేరటానికి ప్రవేశ పరీక్షల విధానం ముందు కొచ్చింది. వీటన్నిటికీ కోచింగ్ సెంటర్లు తెరవటంతో కార్పొరేటు కాలేజీల పంట పండింది. కార్పొరేటు విద్యా వ్యాపారం వందల కోట్లను దాటి వేల కోట్ల రూ॥కు చేరుకొంది. రాష్ట్రవ్యాపితంగా కార్పొరేటు విద్యా సంస్థలను విస్తరించడమేగాక, రాష్ట్రాల సరిహద్దులు కూడా దాటి సమాంతర విద్యావ్యవస్థగా రూపొందింది. ఈ విద్యా వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు కార్పొరేటు విద్యాసంస్థల నడుమ పోటీ కూడా తీవ్రమైంది. ('ర్యాంక్' సాధించిన విద్యార్థి తమ కళాశాలలో చదివాడంటే, కాదు తమ కళాశాలలోనే చదివాడని తప్పుడు ప్రచార ప్రకటన లివ్వటమేగాకుండా, ఆ 'ర్యాంకు' సాధించిన విద్యార్థిని కిడ్నాప్ చేశారని నారాయణ – చైతన్య కళాశాలలు పరస్పర పోలీసుకేసులు పెట్టుకోవటాన్ని ఇటీవలే చూశాం) వివిధ కోర్సులలో, లేదా ప్రవేశ పరీక్షలలో మెరుగైన ఫలితాలు లేదా ర్యాంకులు సాధించటం కోసం కార్పొరేటు విద్యాసంస్థల మధ్య పోటీ తీవ్రమై, ర్యాంకులను రాబట్టుకోవటానికి ప్రభుత్వాధికారాన్ని ఉపయోగించి పైరవీలతో లబ్ధి పొందటం, ప్రభుత్వ ఉన్నతాధికారులను లోబరుచుకుని తమ చట్ట ఉల్లంఘనలపై నోరెత్తకుండా చేయటం, ప్రశ్నా పత్రాలను గుట్టుచప్పుడు కాకుండా ముందుగానే ఎంపిక చేయబడిన తమ విద్యార్థులకు వెల్లడి అయ్యేట్లు చేసుకోవటం.... వంటి అనేక అక్రమ, అనైతిక విధానాలకు కార్పొరేటు విద్యాసంస్థలు దిగజారాయి.

అంతేగాక, అధికారంలోకి వచ్చిన పాలకులంతా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను కొనసాగిస్తూ అనేక పరిశ్రమలను మూతవేయటంతోపాటు, మరెన్నో ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటుపరం చేస్తూ బహుళజాతి కంపెనీలకు కట్టబెడుతూ

ఉద్యోగాల సంఖ్యను కుదించివేస్తున్నారు. మరోవైపున, అధికారంలో వున్న ప్రభుత్వాలేవైనా, నిరుద్యోగ సమస్యకు మార్గాలన్వేషించకపోగా, ప్రభుత్వంలో ఖాళీ అయిన ఉద్యోగ పోస్టులను సైతం భర్తీ చేయకపోవటంతోపాటు, ఉన్న ఉద్యోగాలనే తొలగించివేస్తున్నాయి.

ఈ విధానాలన్నింటి కారణంగా నిరుద్యోగ సమస్య నానాటికీ తీవ్రరూపం దాలుస్తున్నది. ఎటొచ్చీ వున్న అరాకొరా విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం చదువుకుంటున్నవారి మధ్య పోటీ తీవ్రమౌతోంది. సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు మెరుగ్గా వుంటాయంటే అటువైపు, కామర్స్ రంగంలో సిఏ, సిఎంఏల రూపంలో మెండుగా అవకాశాలు లభిస్తాయంటే ఇటువైపు.... విద్యార్థుల, తల్లిదండ్రుల వెంపర్లాట తీవ్రమైంది. దీనిని ఆసరా చేసుకొన్న కార్పొరేట్‌సంస్థలు కృత్రిమ 'బూమ్'ను సృష్టించి తల్లిదండ్రులను ఆకర్షించటం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచుకొని కోట్లాది రూ॥ లాభాలు గడిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో - ఫలానా ప్రవేశ పరీక్షలో తమ విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించటం ద్వారా, ఫలానా కోర్సుల్లో అత్యధిక మార్కులు సాధించటం ద్వారా, తమ కళాశాలల 'కీర్తిపతాకాలను' రెపరెపలాడించటం ద్వారా, విద్యా వ్యాపారాన్ని మరింత జోరుగా సాగించే అవకాశాల కోసం - కార్పొరేటు విద్యాసంస్థలు విద్యార్థులపై అసహజ వత్తిడిని అనూహ్యంగా, అమానవీయంగా పెంచివేస్తున్నాయి. మార్కులు, సీటు లేదా ర్యాంకు కోసం తమ విద్యాసంస్థలలో చేరిన విద్యార్థులను యంత్రాలకంటే ఘోరంగా పరిగణించటం - వారి విద్యావ్యాపార లాభదాహాన్ని సూచిస్తోంది.

## విద్యార్థులపై పెంచుతోన్న వత్తిడి

బయట సమాజంలోని ఇతరేతర పరిణామాలేవీ పట్టించుకోవద్దనీ, తమ చదువులు, రాయబోయే పరీక్షలు, సాధించాల్సిన ర్యాంకులపైనే కేంద్రీకరించి ఆ లక్ష్యాలను సాధించటం ద్వారా తమ కెరీర్‌ను ఉన్నతంగా మలచు కోవాలంటూ సింగిల్‌పాయింట్ ఎజెండాను కార్పొరేటు విద్యాసంస్థలు విద్యార్థులకు నిర్దేశిస్తున్నాయి. తదనుగుణంగా విద్యార్థుల మేధస్సు వికసించే తొలిదశలోనే, వారి ఆసక్తులతో సంబంధంలేకుండా, అంతులేని భారాన్ని వారిపై మోపుతూ, తెల్లవారుఝామున నాలుగు గంటల నుండి రాత్రి 11 గం॥ వరకు నిర్విరామంగా, యాంత్రికంగా - ఆదివారాలు - పండుగలు - ఆటలు - సరదాలు లేకుండా సాగించే ఈ చదువుల యజ్ఞంతో, విద్యార్థులలో సృజనాత్మకత, చలాకీతనం - అప్పటికి ఇంకా మిగిలి వుంటే - అవి కాస్తా ఆవిరైపోతున్నాయి. కెరీర్ పట్ల తీవ్ర వ్యామోహాన్ని పెంచుకొని, తదనుగుణంగా తమను తాము మలచుకొన్న అతికొద్దిమంది విద్యార్థులు మినహా అత్యధికులు కార్పొరేటు విద్యాసంస్థల 'రుద్దుడు'తో జీవం కోల్పోయి మందకొడిగా తయారవుతున్నారు. నిర్బంధంగా బట్టీయానికి సిద్ధమౌతున్నారు. ప్రతి వారాంతంలో పరీక్షలు, గ్రేడింగ్‌లు, తదనుగుణంగా సెక్షన్లలో మార్పులు, తరగతి గదుల్లో అందరి ముందూ బహిరంగంగా అవమానించడాలు, అబ్బాయిలను భౌతికంగా దండించటాలు, అమ్మాయిల ప్రత్యేక సమస్యలను పరిగణలోకి కూడా తీసుకోకుండా అవమానకరంగా వ్యాఖ్యానాలు - వంటి చర్యలతో కార్పొరేటు విద్యాసంస్థలు - విద్యార్థినీ విద్యార్థులకు బందిఖానాలను తలపింపజేస్తున్నాయి. ఈవిధంగా తమ ఇష్టాలను, ఆలోచనలను అణచిపెట్టి, అణచిపెట్టి వుంచడం - ఒక్కసారిగా విజృంభించి అరాచకంగా వ్యవహరించడానికో లేకుంటే తీవ్ర నిరాశా నిస్పృహలకు గురై జీవితాన్ని చాలించాలని అనుకోవడానికో దోవ తీస్తోంది.

## తల్లిదండ్రుల గుంజాటన

ఈ సమాజంలో భాగమైన విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రధానంగా ఆర్థికంతో ముడిబెట్టి మాత్రమే తమ బిడ్డల సుందర భవిష్యత్తును ఊహిస్తున్నారు. నాణ్యమైన విద్యనందించని ప్రభుత్వ విద్యాసంస్థల వైఫల్యంతోపాటు, పరిమితంగానున్న ఉన్నత విద్యా, ఉద్యోగ అవకాశాల కారణంగా పోటీ అధికంగా నుండటంతో అనివార్యంగా తమ బిడ్డలను ఈ పోటీలకు సిద్ధం చేయటానికి నెట్టబడుతున్నారు. ఈ ఆలోచనా ధోరణితోనే లక్షలాది రూపాయలు వెచ్చించైనా (లేకుంటే అప్పుచేసైనా) తమ బిడ్డల భవిష్యత్తును రూపుదిద్దాలని కలలుకంటూ కార్పొరేటు విద్యాసంస్థల 'మహారాజ పోషకులుగా' మారారు. తల్లిదండ్రులు పెట్టిన 'పెట్టుబడి'తో, విద్యార్థులు చదువు'కొని', దీనిని సాధనంగా చేసుకొని భవిష్యత్తులో అనేక రెట్లు 'లాభం' ఆర్జించటమే పరమావధని కార్పొరేట్ 'వ్యాపార సూత్రం' విద్యార్థులకు బోధిస్తోంది. ఏమైనా, విద్యను, విజ్ఞానాన్ని ఆర్జించి సమాజానికి వుపయోగపడాలనుకోవటం, దేశ, ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపెట్టాలనుకునే చెదురుమదురు భావనలు కూడా అదృశ్యమౌతున్నాయి. ఉన్నతస్థాయి చదువు, ఉద్యోగాలనందుకోవటమే, విదేశీ అవకాశాలు పొందటమే, తద్వారా భారీగా డబ్బు, పెద్దహోదా సాధించటమే జీవిత పరమార్థంగా మారిపోతోంది. లక్షల రూపాయలు వెచ్చించి తల్లిదండ్రులు తమ బిడ్డలను కార్పొరేటు విద్యాసంస్థలకప్పగించి, జరుగుతున్న ఘటనలతో గుంజాటనకు గురవుతూనే వున్నారు. ఈ వత్తిడులన్నీ అధిగమించి తమ బిడ్డలు బయటపడాలని 'ర్యాంక్ కొట్టాలని' వాంఛిస్తూ, కలలుగంటూ, దాట వేసుకుంటూ వస్తున్నారు.

ఈ మొత్తం క్రమంలో - ఆయా కార్పొరేట్ విద్యా సంస్థల 'పేరు, ప్రతిష్టల'ను ఇనుమడింపజేయాల్సినవారూ, ఉన్నత ఫలితాలను సాధించి తల్లిదండ్రుల ఆకాంక్షల నందుకోవలసినవారూ, దీనికోసం బాల్యాన్నీ లేదా యవ్వనాన్నీ పణంగాపెట్టి "వెట్టిచాకిరీ" చేయవలసినవారూ ఆయా కార్పొరేటు సంస్థల విద్యార్థినీ, విద్యార్థులే కనుక, మెట్టుమెట్టుగా వారిపై పెంచుతోన్న ఈ వత్తిడిని తట్టుకోలేక అనేకమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

## 'కార్పొరేట్' ఆత్మహత్యలు – భిన్నవాదనలు

కార్పొరేటు విద్యాసంస్థలలో విద్యార్థుల బలవన్మరణాలకు కారణమౌతున్న ఆయా యాజమాన్యాల 'శిక్ష'ణా పద్ధతులు, బోధనా గంటలు, క్రమ'శిక్ష'ణా చర్యలు, శారీరక మానసిక వేధింపులు – సుదీర్ఘకాలంగా సాగుతూనే వున్నా, ప్రభుత్వాలేవీ దీనిలో జోక్యం చేసుకొని యాజమాన్యాలను నిరోధించేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. ఘనత వహించిన నారాయణ విద్యాసంస్థల అధినేత అయిన మంత్రి నారాయణ వియ్యంకులైన విద్యాశాఖామంత్రి గంటా శ్రీనివాసరావు 'కార్పొరేటు కాలేజీలలో ఇన్ని గంటలపాటు చదివిస్తారా' అని ఇపుడే తెలుస్తున్నట్లుగా ఆశ్చర్యపోవటానికి మించిన వంచన మరోటి వుంటుందా? బలవన్మరణాల తీవ్రత పెరిగి, పత్రికలలో చర్చనీయాంశమైనపుడు కంటితుడుపు చర్యలు, చేవలేని హూంకారాలు, కమీషన్ల నియామకాలతో మంత్రులు సరిపెడుతున్నారు. తిరిగి ఆ కమీషన్ల నివేదికలను చెత్తబుట్టలో పడవేస్తున్నారు.

విద్యార్థులు పెద్దసంఖ్యలో కార్పొరేట్ విద్యాసంస్థల వైపు నెట్టబడటానికి ప్రధాన కారణమైన 'ప్రభుత్వ విద్య పట్ల పాలకుల ఘోర నిర్లక్ష్యం' గురించి చర్చే జరగటంలేదు. ఆత్మహత్యలను మాస్ హిస్టీరియా, బయోసైకో, సామాజిక రుగ్మతలుగా కొందరు విశ్లేషిస్తున్నారు. వంశపారం పర్యంగా కుటుంబాలలో ఆత్మహత్యలకు పాల్పడాలనిపించే జీన్స్ గురించి మరికొందరు 'మేధావులు' వ్యాఖ్యానిస్తున్నారు. ప్రతి కళాశాలలో ఒక సైకాలజిస్టును నియమిస్తే సమస్య పరిష్కారమౌతుందని మరికొందరు చెబుతున్నారు. రోజువారీ విద్యార్థుల షెడ్యూలులో చిన్నపాటి మార్పులు చేయాలని, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో మరికొందరు సరిపెడుతున్నారు.

విద్యార్థి యువజనులకు – మొత్తం సమాజంలోని వివిధ రంగాల ప్రజానీకానికీ సమస్యల తీవ్రత పెరుగుతుందనే వాస్తవాన్ని మొదట గుర్తింపజేయాలి. దీనికి కారణమైన పాలకుల విధానాలతో సంఘర్షించి ఈ పరిస్థితిని మనమే మార్చుకోవాలనే పట్టుదల పెరగకుండా బలహీనమనస్కులుగా ఎందుకు మారిపోతున్నారనే దానిని శాస్త్రీయంగా విశ్లేషణ చేయకుండా ఆత్మహత్యల సమస్య పరిష్కారం కాదు.

## స్వచ్ఛమైన స్నేహం కరువైన విషాదం

కార్పొరేటు – ప్రైవేటు విద్యాసంస్థల విస్తరణకు ముందు కాలంలో అందరూ కలిసిమెలిసి 'కామన్'గా విద్యనభ్యసించే ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రధానంగా వుండేవి. ఇప్పుడు 40–50 ఏళ్ళ పైబడిన వయస్సున్న 'ప్రముఖ' స్థానాలలోని వారిలో అత్యధికులు – వారి ఆర్థికస్థితి గతులతో నిమిత్తం లేకుండా బాల్యంలో ప్రభుత్వ విద్యాసంస్థలలో తెలుగు మాధ్యమంలో విద్యనభ్యసించివారే. కులం, అంతస్తుల అంతరాలతో సంబంధంలేని స్నేహం సాపేక్షికంగా ఆనాడు సాధ్యమయ్యేది. ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవాటి ద్వారా ఏర్పడిన సాన్నిహిత్యాలు, పరస్పరం తోడ్పాట్లు, స్నేహాలు, అనుభవాలు కలబోసుకోవటం వంటివన్నీ విద్యార్థుల భావి వ్యక్తిత్వం రూపుదిద్దుకోవటంలో ప్రభావం చూపేవి.

దీనికి భిన్నంగా లక్షల రూపాయలు వెచ్చించి చదువు 'కొనే' నేటి కార్పొరేటు, రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థలో–ప్రభుత్వ కామన్ విద్యాసంస్థలలో విద్యార్థులు పొందిన అనుభవాలేవీ అందే అవకాశం లేదు. కష్టభరిత జీవిత నేపథ్యంగల పేద విద్యార్థులకు కార్పొరేటు విద్యాసంస్థలలో ప్రవేశమే వుండదుకనుక, వారితో మెలిగే అవకాశమే ఉండదు. సాపేక్షికంగా ధనిక నేపథ్యం నుండి వచ్చిన ఈ విద్యార్థులలో 'గ్రేడ్ల'ను బట్టి, కులాలను బట్టి స్నేహాలు చేసే స్వార్థపరత్వం, సంకుచితత్వం బాగా దట్టించారు. మనసువిప్పి ఇబ్బందులను కలబోసుకునే స్వచ్ఛమైన స్నేహ హృదయాలు ఈవయస్సులో కరువవటం మరో విషాదం.

## మానసిక స్థైర్యాన్నిచ్చే విద్యార్థి ఉద్యమాలు

జాతీయోద్యమ కాలంలోనూ, తదనంతర కాలంలోనూ దేశభక్తియుత, ప్రగతిశీల, ప్రజాతంత్ర భావాలతో విద్యార్థి ఉద్యమం సమాజంపై – ప్రత్యేకించి విద్యార్థిలోకంపై ఒక మంచి ప్రభావాన్ని కలిగివుండేది. అభివృద్ధి నిరోధక, ప్రగతి వ్యతిరేక భావాలతో సంఘర్షణతోనే ఆనాడు కూడా ఇది సాధ్యమైంది. విద్యార్థుల విద్యా సమస్యల పరిష్కారం కోసం, శాస్త్రీయ విద్యావ్యవస్థ సాధనకోసం కృషిచేస్తూనే మొత్తంగా సామాజిక మార్పుకోసం, సంఘసంస్కరణ కోసం తపించటం, ఇతర రంగాల ప్రజానీకంతో విద్యార్థులు మమేకమవటం; వ్యక్తిగతాన్ని మించిన ఒక సామాజిక ఆదర్శాన్ని స్వీకరించి కృషిసాగించటం ఎంతోమందికి ఉత్తేజకరంగా వుండేది. కులాంతర, మతాంతర ఆదర్శ వివాహాలకు కూడా ప్రగతిశీల ఉద్యమాలు అండగా వుండటంతో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా నిలబడేందుకు తగిన తోడ్పాటు వుండేది.

సాపేక్షంగా ప్రజా వుద్యమాలు – అందులో భాగంగా ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలు వెనుకపట్టు పట్టడం; సమాంతర విద్యావ్యవస్థగా కార్పొరేటు విద్యా రంగం విస్తరించి, రాజకీయ వాసనలు సోకకుండా బహిరంగ జైళ్ళలో భారీ సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులను చదువే లోకంగా నిర్బంధించటం, విద్యార్థి యువతను పనిగట్టుకుని నీరుగార్చేందుకు పతన విలువలను, సామ్రాజ్యవాద సంస్కృతిని పాలకులే పెద్దఎత్తున ప్రోత్సహించటం వంటివన్నీ కలగలసి విద్యార్థి యువతలో అరాచక సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయి. మరో పార్శ్వంలో సమస్యల నుండి పలాయనమయ్యేవారుగా, బలవన్మరణాలకు పాల్పడే బలహీన మనస్కులుగా తయారు చేస్తున్నాయి.

## సంఘర్షణ మానవ మనుగడ సూత్రం

మానవ పరిణామక్రమంలో – తన మనుగడ కోసం ప్రకృతితో సమిష్టిగా, నిరంతర సంఘర్షణ పడిన క్రమంలోనే ఉత్పత్తి

పెరిగింది; ఉత్పత్తి పరికరాలు అభివృద్ధి అయ్యాయి; మానవుడి ఆలోచనా తీరూ విస్తృతమైంది. వర్గసమాజ ఆవిర్భావంతో, సమాజంలో అత్యధికులైన కష్టజీవులు – సంపదలనన్నీ తమ గుప్పెటలో బంధించిన కొద్దిమందిగా వున్న దోపిడీవర్గ శక్తులకు వ్యతిరేకంగా జరిపిన నిరంతరాయ పోరాటాలలోనే సమాజం అభివృద్ధి చెందుతూ వస్తోంది.

చరిత్రను, రాజకీయ పరిణామాలను – ఏదోమేరకైనా తెలుసుకోవటానికి అవకాశమున్న సామాజిక శాస్త్రాల కోర్సులే నామమాత్రమైన నేటి విద్యావ్యవస్థలో – మరీ ముఖ్యంగా కార్పొరేటు సంస్థలలో విద్యార్థులకు ఈ కనీస జ్ఞానమే అందటంలేదు.

సంఘర్షణ మానవ జీవన అభివృద్ధికి సోపానంగా వుంది. ఈ సార్వజనీన సూత్రాన్ని సరిగా అన్వయించుకొని ఎదురౌతున్న పరిస్థితులతో సంఘర్షణపడటానికి బదులుగా, బలవన్మరణాలకు పాల్పడటం ఈనాడు సమాజంలో పెరిగిపోతున్న ఓ విపరీత ధోరణిగా వుంది. భావజాలపరంగా దీనిని మొదట ఓడించాలి.

**కార్పొరేటు విద్యావ్యవస్థ మూలాల్ని ప్రశ్నించాలి**

కుటుంబాన్ని – విద్యారంగాన్ని – మొత్తంగా సమాజాన్ని శాసిస్తున్న అభివృద్ధి నిరోధకులకు, దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాలు భావజాల రంగంలో అభివృద్ధికర మార్పులకు దోహదపడ్తాయి. తిరిగి ఈ ప్రగతిశీల భావజాలం వ్యవస్థ మౌలిక మార్పుకు సాగే పోరాటాలను వేగిరపర్చేందుకు దోహద పడటం ద్వారా పరస్పరం ప్రభావితం చేసుకుంటాయి.

ప్రగతిశీలురు, వివేచనాపరులంతా ఈ దిశగా ఆలోచించాలి. విద్యార్థి యువతలో పాలకులు పెంచి పోషిస్తున్న పలాయనవాద సంస్కృతికి వ్యతిరేకంగా తమ కలాలను, గళాలను ఎక్కుపెట్టాలి. ఆత్మహత్యలు జరుగుతున్నపుడు వేదన చెందటం సహజమే. వెనువెంటనే స్పందించటమూ మంచి విషయమే. అయితే అంతటికే పరిమితం కారాదు. ఈ విషాదాలకు తక్షణ కారణమౌతున్న యాజమాన్యాల దుష్టత్వంపై ఆగ్రహమూ సమంజసమే. కానీ కారణాన్ని అక్కడికే కుదించరాదు. లేదా పైపై సర్దుబాట్లతో సంతృప్తిచెందరాదు. కార్పొరేటు విద్యా వ్యవస్థ మూలాల్ని ప్రశ్నించే శాస్త్రీయ అవగాహన విద్యార్థి యువజనులకందిస్తూ, పాలకులను నిలవేసే ఒక నిరంతర ఉద్యమ కార్యాచరణ సాగాలి. ప్రజలందరికీ అందుబాటులో వుండే; దేశ – ప్రజల ప్రయోజనాలకు అనుగుణమైన విద్యార్థుల బహుముఖ వికాసానికి దోహదపడే శాస్త్రీయ విద్యావిధాన సాధన కోసం సాగే ఈ కృషి మాత్రమే విద్యార్థి – యువజనులలో బలవన్మరణాలకు అడ్డుకట్ట వేయగలుగుతుంది.

oooo